సాక్షి నిజామాబాద్

బుధవారం । 25 । అక్టోబర్ । 2023



శోభాయమానంగా..

జిల్లావ్యాప్తంగా దుర్గామాత ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు వైభవంగా జరిగాయి. నిమజ్జనానికి విగ్రహాలను తరలించారు.

- 11లో ▸



బోధన్‌లో పోలీసుల కవాతు

బోధన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కవాతు నిర్వహించారు. సీపీ కల్మేశ్వర్ పాల్గొన్నారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
33.1 /19.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఎండతీవ్రత తక్కువగా ఉండవచ్చు. సాయంత్రం చలిగాలులు వీస్తాయి. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



డిచ్‌పల్లి: ఏడో బెటాలియన్ డిచ్‌పల్లి ఆవరణలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కమాండెంట్ బి.రాంప్రకాశ్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు అర్చకులు స్వామి వారికి స్వస్తి పుణ్యావాచనం, రక్షాబంధనం, దీక్షా స్వీకరణ, మృత్సంగ్రహణం, అంకురారోహణం, మంటపపూజ, శాలా ప్రవేశం, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. ఉత్సవాల్లో అసిస్టెంట్ కమాండెంట్స్ ఎం.వెంకటేశ్వర్లు, సి.ఆంజనేయరెడ్డి, కె.భాస్కరరావు, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్సైలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పత్తి క్వింటాలుకు రూ.7,200

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని పత్తి ఫ్యాక్టరీలో మంగళవారం కొనుగోళ్లు ప్రారంభమైన మొదటి రోజు క్వింటాల్ పత్తి రూ.7200 వేలు పలికింది. దసరా పండగ పురస్కరించుకుని కృష్ణ నాచురల్ ఫైబర్ ఫ్యాక్టరీలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించామని పత్తి ఫ్యాక్టరీల యాజమానులు చెప్పారు. ప్రతి ఏడాది సీజన్ మొత్తంలో మూడు లక్షల క్వింటాళ్ల పత్తిని రైతులు మార్కెట్‌కు తీసుకువస్తారని వారు చెప్పారు. ప్రస్తుతం ఇతర ప్రాంతాల నుంచి పత్తిని తీసుకువచ్చి ముహూర్తం ప్రారంభించామని వారు తెలిపారు.

కేసీఆర్ సభ ఏర్పాట్ల పరిశీలన



బాన్సువాడ రూరల్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 30న బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ బాన్సువాడలో జరిగే బహిరంగ సభలో పాల్గొననున్నారు. దీనిలో భాగంగా మంగళవారం బాన్సువాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి బహిరంగ సభ స్థలిని పరిశీలించారు. పలు సూచనలు చేశారు. డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి, అంజిరెడ్డి, తదితరులున్నారు.

జాతీయ స్థాయి అర్చరీ పోటీలకు ఎంపిక



దోమకొండ: జాతీయ స్థాయి అర్చరీ పోటీలకు క్రీడాకారులు ఎంపికైనట్లు అర్చరీ కోచ్ ప్రతాప్‌దాస్ మంగళవారం తెలిపారు. ఈ నెల 21న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అర్చరీ పోటీల్లో ఇండియన్ రౌండ్‌లో దోమకొండకు చెందిన భవాని, రికర్వ్ రౌండ్‌లో సింధూజ స్వర్ణ పతకాలు సాధించారన్నారు. వీరు ఈ నెల 28 నుంచి గోవాలో జరిగే జాతీయస్థాయి అర్చరీ పోటీలకు, నవంబర్ 24 నుంచి ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికై నట్లు ఆయన వివరించారు. ఉమ్మడి జిల్లా అర్చరీ అసోసియేషన్ ప్రతినిధులు నర్సింహారెడ్డి, సంజీవ్‌రెడ్డి, తిర్మల్‌గౌడ్, మోహన్‌రెడ్డి తదితరులు అభినందించారు.

26న కేఏ పాల్ రాక

కామారెడ్డి టౌన్: ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఈనెల 26వ తేదీన అడ్లూర్ ఎల్లారెడ్డికి రానున్నారు. ఈ మేరకు ఆయన స్వయంగా వాయిస్‌రికార్డును రైతు ప్రతినిధులకు పంపించారు. కామారెడ్డి మాస్టర్‌ప్లాన్ బాధితుల జేఏసీ సమావేశానికి హాజరవుతానని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల బరిలో బాధితుల రైతుల్లో నుంచి ఒకరిని పోటీలో ఉంచి గెలిపించుకుందామన్నారు. కామారెడ్డిలో కేసీఆర్‌ను ఓడించాలని, తెలంగాణను కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అడ్లూర్ ఎల్లారెడ్డిలో జరిగే సమావేశానికి రైతులు, నిరుద్యోగులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

బుజ్జగింపుల పర్వం

- యథేచ్ఛగా ప్రలోభాలను నడిపిస్తున్న ఓ సిట్టింగ్ అభ్యర్థి
- స్థానిక ప్రజాప్రతినిధులను ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు
- దావత్‌ల కోసం సంఘాలకు మేకలు
- ఆలయాల వద్ద ప్రచారం చేస్తుండగా అభ్యర్థిని నిలదీసిన భవానీ దీక్షాపరులు
- అధికార యంత్రాంగం ఉదాసీనతపై విమర్శలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ప్రచారపర్వంలో భాగంగా జిల్లాలో ఓ సిట్టింగ్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆగమాగమవుతున్నట్లు ఆ నియోజకవర్గంలో వివిధ వర్గాల్లో కథలు చెప్పుకున్న మాదిరిగా చర్చ జరుగుతోంది. టికెట్ ఖరారుతో ముందుగానే ప్రచారం ప్రారంభించిన సదరు ఎమ్మెల్యే మొదటి విడతలో ఒక తరహాలో వెళ్లారు. గ్రామాల్లో సమస్యల విషయమై ప్రశ్నిస్తే దాడులు కూడా చేయాలని తన అనుచరులకు సూచించిన సదరు సిట్టింగ్ ఎన్నికల కౌంట్‌డౌన్ అవుతున్నాకొద్దీ వైఖరి మార్చుకుంటూ వస్తున్నారు. సదరు సిట్టింగ్ అభ్యర్థి వ్యవహార శైలిపై ఇప్పటికే సాధారణ ఓటర్లతో పాటు సదరు పార్టీకే చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఆవేదనతో ఉన్నారు. ఆగ్రహంగానూ ఉన్నారు. ఈ క్రమంలో సదరు స్థానిక ప్రజాప్రతినిధులు కాంగ్రెస్, బీజేపీ నేతలతో టచ్‌లో ఉన్నట్లు తెలియడంతో సదరు సిట్టింగ్ మదిలో గాభరా మొదలైంది.

రైస్ కుక్కర్ల పంపిణీ..

ఇప్పటికే పలు గ్రామాల్లో కారు గుర్తు స్టిక్కర్లతో కూడిన రైస్ కుక్కర్లు పంపిణీ చేయించారు. ఈ కుక్కర్లు కొన్ని చోట్ల సరిపోకపోవడంతో ఆయా గ్రామాల్లో పలువురు తమకూ ఇవ్వాలని డిమాండ్లు చేస్తున్నారు. ఇక ప్రతిరోజూ ఆ నియోజకవర్గ కేంద్రంలో క్యాంప్ కార్యాలయంలో ఎన్నికల నిబంధనలు బేఖాతరు చేస్తూ సదరు అభ్యర్థి మటన్‌తో విందులు ఏర్పాటు చేయిస్తుండడం గమనార్హం. రాత్రి సమయాల్లో మద్యం దావత్‌లు కూడా చేస్తున్నారు. మరోవైపు దసరా నేపథ్యంలో ఆయా సంఘాలకు సదరు సిట్టింగ్ మేకలను విచ్చలవిడిగా ఇస్తుండడం గమనార్హం. ఈ క్రమంలో వివిధ కులసంఘాల సమావేశాలు ఏర్పాటు చేయించి ప్రచారానికి వెళ్తున్నాడు. అయితే ఆయా సంఘాల్లోని సభ్యులందరూ సమావేశాలకు రావాల్సిందేనని తీర్మానాలు కూడా ముందుగానే చేయించడంతో కొందరు సభ్యులు, తటస్తులు మాత్రం ఇలా ఒత్తిడి చేయడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ సిట్టింగ్ తమ ఊర్లలోకి రావద్దంటూ గతంలో పలు గ్రామాల్లో అమలు కానీ హామీలతో కూడిన ఫ్లెక్సీలు కూడా ప్రదర్శించిన సందర్భాలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో హామీలపై నిలదీసిన విషయాలకు సంబంధించి పలువురు వీడియోలు తీస్తే ఆ వీడియోలను పోలీసులు డిలీట్ చేయించిన సందర్భాలు సైతం ఉన్నాయి. ఈ నేపథ్యంలో పలువురు యువకులు మాత్రం ప్రజా సమస్యల విషయమై సోషల్ మీడియా వేదికగా సెటైర్లు వేస్తుండడం గమనార్హం.

సర్పంచ్‌లకు బంగారు కానుకలు

కొన్ని నెలల క్రితం వరకు తమతో దురుసుగా వ్యవహరించిన నేపథ్యంలో ఆగ్రహంగా ఉన్న సర్పంచ్‌లు దెబ్బ కొట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుసుకున్న సిట్టింగ్ వారిని ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా కొందరు సర్పంచ్‌లకు తులం చొప్పున బంగారం, ఉప సర్పంచ్‌లకు నగదు, సొసైటీ చైర్మన్‌లకు బంగారం తదితర తాయిలాలు ఇస్తూ ప్రలోభాలకు గురిచేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఓటమి భయంతోనే ఇలా విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నాడని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలే చర్చించుకోవడం విశేషం.

కాగా ప్రచారంలో భాగంగా కుక్కర్లు పంచిన అభ్యర్థి గరంగరంగా వండుకుని తిన్నారా అని పలుచోట్ల వ్యాఖ్యలు చేయడంపై విమర్శలు చేస్తున్నారు. చివరకు ఆలయాల వద్ద సైతం ప్రచారానికి వెళ్లడంతో ఒక గ్రామంలో సిట్టింగ్ అభ్యర్థి వర్గీయులకు భవానీ దీక్షాపరులకు మధ్య ఘర్షణ కూడా చోటుచేసుకుంది. ఈ క్రమంలో సదరు అభ్యర్థి పలాయనం చిత్తగించడం విశేషం. ఇలాంటి ప్రలోభాల నేపథ్యంలో అధికార యంత్రాంగం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం పట్ల విమర్శలు వస్తున్నాయి.



రావణ దహనం

జిల్లావ్యాప్తంగా సోమవారం విజయదశమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా జంబి వృక్షానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల రావణదహన కార్యక్రమాలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. - బోధన్ టౌన్

సంతోషంగా ఉంటేనే అసలైన పండుగ

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- ఖిల్లా రామాలయంలో ప్రత్యేక పూజలు, రాముడి పాట ఆవిష్కరణ

నిజామాబాద్ సిటీ : ప్రజలు సంతోషంగా ఉన్నప్పుడే పండుగలు ఎంతో సంబురంగా జరుగుతాయని, ఇది తెలంగాణ వ్యాప్తంగా కనిపించిందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. మంగళవారం నగరంలోని ఖిల్లా రామాలయంలో శ్రీరాముడుకి అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు సిర్ప రాజుతో కలిసి పట్టు వస్త్రాలు సమర్పించారు. బతుకమ్మ సందర్భంగా శ్రీ రాముడిపై పాడిన పాటను ఛక్రంగుడి అర్చకుడు కందళై నరసింహామూర్తి(నాని పంతులు) చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం కవిత మాట్లాడుతూ తెలంగాణ ఆడబిడ్డలంతా తొమ్మిదిరోజుల పాటు ఘనంగా బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు. తాను ఈసారి షోలాపూర్‌కు వెళ్లి సద్దుల బతుకమ్మ జరుపుకున్నానన్నారు. ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ పండుగలు వైభవంగా జరుగుతుండటం చాలా సంతోషమన్నారు. దసరా సందర్భంగా ఖిల్లా రామాలయంలో శ్రీరాముల వారిని దర్శించుకుని బతుకమ్మ సందర్భంగా తాను శ్రీ రాముడిపై పాడిన పాటను ఆలయ అర్చకుడు చేతుల మీదుగా ఆవిష్కరించామన్నారు.

మనందరికీ మంచి చేస్తున్న సీఎం కేసీఆర్, నిజామాబాద్ నగరాన్ని అభివృద్ధి చేస్తున్న బిగాల గణేశ్‌గుప్తాకు సముచిత స్థానం దక్కాలన్నారు. అనంతరం అర్చకులు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలను ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేంద్రప్రసాద్, అంబదాస్ రావు, బంటు బలరాం, న్యాయవాదులు మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఖిల్లా రామాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత, అర్బన్ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా

కొనుగోలు కేంద్రాల ప్రారంభమెప్పుడో!

- ప్రారంభమైన వరి కోతలు
- కేంద్రాలకు అనుమతి రాలేదంటున్న అధికారులు

బాల్కొండ : వరి రైతుకు మద్దతు ధర కల్పించడం కోసం ప్రతి ఏడాది ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలో ఇప్పటి వరకు కేంద్రాలను ప్రారంభించలేదు. ప్రధానంగా ముప్కాల్ మండలంలో పలు గ్రామాల్లో వరి కోతలు జోరందుకుంటున్నాయి. వరిధాన్యాన్ని కల్లాల్లో, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కుప్పలు వేస్తున్నారు. కాని ఇప్పటిదాకా ఎప్పుడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తారో అధికారులు చెప్పడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ఏడాది సకాలంలో వర్షాలు కురువడంతో పాటు, శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి సకాలంలో వరదలు రావడంతో రైతులు సకాలంలో వరినాట్లు వేశారు. ఉమ్మడి బాల్కొండ మండలంలో ప్రధానంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటి ఆధారంగానే వరి పంటలను సాగు చేస్తారు. బోరు బావులు తక్కువగా ఉండటంతో ప్రాజెక్ట్ నీరే అధిక శాతం ఉపయోగపడుతుంది. వరిపంటకు ప్రభుత్వం ఏగ్రేడ్‌కు 2,060, బీ గ్రేడ్‌కు 2,040 ప్రకటించింది. పల్లెల్లో దళారులను దందా షురు చేయకముందే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.



రెంజర్లలో రోడ్డుపై ఆరబెట్టిన వరి ధాన్యం

ఇప్పటిదాకా ఆదేశాలు రాలేదు..

మండల పరిధిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు ఇప్పటిదాకా ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఆదేశాలు రాగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం. – వనజారాణి, తహసీల్దార్, ముప్కాల్

సాలూర ఎత్తిపోతలకు తాళం

- పథకానికి చెందిన ట్రాన్స్‌ఫార్మర్ చోరీ
- యాసంగి సాగు ప్రశ్నార్థకం
- కలెక్టర్ స్పందించాలంటున్న రైతులు



తాళం వేసి ఉన్న ఎత్తిపోతల పథకం పంప్‌హౌజ్

బోధన్ : బీడు భూములను సస్యశ్యామలం చేసిన సాలూర ఎత్తిపోతల పథకానికి తాళం పడింది. తాజాగా ఎత్తిపోతల పథకం పంప్‌హౌజ్ పక్కనే ఉన్న కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్‌ను రెండుసార్లు గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి తీగలు, ఆయిల్ చోరీ పాల్పడ్డారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు రూ.10 లక్షలకు పైగా నిధుల అవసరం ఉంది. ఎత్తిపోతల పథకం నిర్వహణ కమిటీ వద్ద డబ్బులు నిల్వ లేక పోవడంతో రైతాంగం నిస్సహాయ స్థితిలో పడ్డారు. యాసంగికి సంబంధించి వందలాది ఎకరాల్లో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికార పక్ష ప్రజాప్రతినిధులు ప్రభుత్వపరంగా నిధులు కేటాయించే పరిస్థితి లేదు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు స్థానిక ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. కలెక్టర్‌పైనే రైతులు ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తున్నారు.

దివంగత వైఎస్సార్ చొరవతో..

సాలూర గ్రామ శివారులోని మంజీర నదిపై రూ.3.80 కోట్లతో ఎత్తిపోతల పథకాన్ని 2009లో పూర్తి చేశారు. ఈ పథకం కింద వర్షాధార మెట్టభూములు, చెరువుల కింద మాగాణిని కలుపుకుని 1600 ఎకరాలను స్థిరీకరించారు. దశాబ్దన్నర కాలంగా రైతులు కలిసికట్టుగా ఎత్తిపోతల పథకాన్ని ప్రణాళిక ప్రకారం సద్వినియోగం చేసుకుని వానాకాలం, యాసంగి సీజన్ పంటలు సాగు చేస్తూ వస్తున్నారు. పథకం నిర్వహణపై పట్టు సాధించారు. వర్షాకాలం ప్రారంభంతోనే మంజీరలో నీళ్ల పారకం మొదలు కాగానే పథకాన్ని ప్రారంభించి చెరువుల్లో నింపుకుంటారు. కాలువల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. ప్రతి సీజన్‌లో పంట చేతికి రాగానే ఎకరానికి రైతులు రూ.800 చొప్పున పథకం నిర్వహణ కమిటీకి చెల్లిస్తారు. ఈ డబ్బులతో సిబ్బంది వేతనాలు, ఇతర అవసరాలకు ఖర్చు పెడుతారు.

రెండు సీజన్లలో పంట సాగు..

పథకం ఆయకట్టు కింద వర్షాధార మెట్ట భూముల్లో వానాకాలం సోయా, యాసంగి శనగ, ఇతర ఆరుతడి పంటలు, చెరువుల కింద వరి పంటను పండిస్తారు. ఈ ఏడాది వానాకాలంలో పండించిన సోయా కోతలు ఊపందుకున్నాయి. శనగ విత్తుకునేందుకు రైతులు భూములను దుక్కిచేసి సిద్ధంగా ఉంచారు. పథకం ప్రారంభం కాకపోతే రైతులకు రూ. లక్షల్లో నష్టం జరిగే అవకాశాలున్నాయి. ఇప్పటికే పథకానికి సంబంధించి రెండుసార్లు ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. మొదటిసారి ఎమ్మెల్యే కోరగా స్పీకర్ రూ.10లక్షలు మంజూరు చేశారు.

కలెక్టర్ కనికరించాలి..



కలెక్టర్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలి. కలెక్టర్‌పైనే గ్రామ రైతులమంతా కొండంత ఆశలు పెట్టుకున్నాం. ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ జరుగకపోతే రైతులు సాగు నిలిచి పెద్ద మొత్తంలో నష్టం జరుగుతుంది. – కేజీ గంగారాం, రైతు, సాలూర గ్రామం

రైతన్న చేతిలో రాజకీయం

- ఉత్తర తెలంగాణ రాజకీయాలను ప్రభావితం చేసిన కర్షకులు
- పార్టీల ఎజెండాలు, ఎన్నికల ఫలితాలను కూడా..
- ఆర్మూర్ నుంచి జాతీయ స్థాయికి చేరిన పసుపు బోర్డు ఉద్యమం
- 2019 పార్లమెంట్ ఎన్నికల్లో 178 మంది రైతుల నామినేషన్లు
- పసుపు, ఎర్రజొన్న గిట్టుబాటు కోసం అనేక ఉద్యమాలు

జంగ్ తెలంగాణ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఉత్తర తెలంగాణలో కీలకమైన ఇందూరు చుట్టుపక్కల ప్రాంతాలు రైతు ఉద్యమాలకు కేంద్ర బిందువులుగా నిలిచాయి. రాజకీయ పార్టీల ఎజెండాలు, ఎన్నికల ఫలితాలను కూడా శాసించేస్థాయిలో ఉద్యమాలు నడిపిన చరిత్ర ఇక్కడి రైతులకు ఉండడం గమనార్హం. ఈ చుట్టుపక్కల ప్రాంతాల రైతులు ఉద్యమాలు తలుచుకుంటేనే ప్రధాన రాజకీయ పార్టీలు ఉలిక్కిపడే పరిస్థితి. ఎన్నికల ఫలితాలను సైతం తారుమారు చేసి ఆ సెగను దేశ రాజధాని ఢిల్లీకి తగిలేలా చేసిన నేపథ్యం ఇందూరు ప్రాంత రైతులది కావడం విశేషం. రాష్ట్రంలో అత్యధికంగా పసుపు పండించే రైతులున్న నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్ జిల్లాల రైతులు తలపెట్టిన వివిధ దశల ఉద్యమం ప్రకంపనలు సృష్టించింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో పసుపు రైతులు కన్నెర్ర చేసిన ఫలితంగా సీఎం కేసీఆర్ కుమార్తె, సిట్టింగ్ ఎంపీ కవిత ఓటమి చవిచూశారు. పసుపు బోర్డు సాధిస్తానంటూ బాండ్ పేపర్ రాసిచ్చిన అర్వింద్ బీజేపీ తరఫున విజయం సాధించారు. ఈ నేపథ్యంలో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి గెలుపొందే లక్ష్యంతో నేరుగా ప్రధానమంత్రి నరేంద్రమోడి ఇక్కడకు వచ్చి పసుపు బోర్డు ప్రకటించడం గమనార్హం.



వారణాసిలో 711 ఓట్లు సాధించిన రైతు ఇస్తారి

పార్లమెంట్‌కు 185నామినేషన్లలో 178రైతులవే..

పసుపు బోర్డు ఏర్పాటు, ఎర్రజొన్నల మద్దతు ధర కోసం రైతులు సుదీర్ఘకాలంగా అనేక ఉద్యమాలు చేశారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యేలు, ఎంపీల ఇళ్ల ఎదుట ధర్నాలు, ఆందోళనలు, రోడ్లపై రాస్తారోకోలు, జాతీయ రహదారుల దిగ్బంధం ఇలా గల్లీ నుంచి ఢిల్లీ దాకా నిరసన తెలిపారు. అయినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి స్పందన రాకపోవడంతో నిజామాబాద్, జగిత్యాల జిల్లాలకు చెందిన 178 మంది రైతులు నిజామాబాద్ లోక్‌సభ స్థానానికి 2019 పార్లమెంట్ ఎన్నికల్లో నామినేషన్లు వేశారు. సీఎం కేసీఆర్ కుమార్తె కవిత సిట్టింగ్ ఎంపీగా ఉన్న నేపథ్యంలో భారీగా నామినేషన్లు వేస్తే సమస్య తీవ్రత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తెలుస్తుందనే ఉద్దేశంతో నామినేషన్లు వేశారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ తర్వాత 185 మంది అభ్యర్థులు బరిలో ఉండగా అందులో 178 మంది రైతులే కావడం విశేషం.

పసుపు బోర్డు కోసం 12 ఏళ్లు చెప్పుల్లేకుండా..



మోర్తాడ్ మండలం పాలెంకు చెందిన పసుపు రైతు ముత్యాల మనోహర్ రెడ్డి పసుపు బోర్డు వస్తేనే చెప్పులు వేసుకుంటానని శపథం చేశారు. 2011 నవంబర్ 4 నుంచి చెప్పులు లేకుండా తిరుగుతూ వచ్చారు. ఈనెల 1న తెలంగాణలో పసుపు బోర్డుకు ప్రధాని మోదీ ఆమోదం తెలపడంతో 2న వేసుకున్నారు. మనోహర్‌రెడ్డి గతంలో చెప్పులు లేకుండానే తిరుపతి వరకు పాదయాత్ర చేశారు.



2019లో ఆర్మూర్‌లో పసుపు బోర్డు కోసం ఆందోళన చేస్తున్న రైతులు

వారణాసికి చేరిన పసుపు బోర్డు పంచాయితీ

2019లో నిజామాబాద్ పార్లమెంట్ స్థానానికి నామినేషన్లు దాఖలు చేసిన రైతులు మరోవైపు పీఎం మోదీ ప్రాతినిథ్యం వహిస్తున్న వారణాసి లోక్‌సభ నియోజకవర్గ బరిలోకి దిగేందుకు ఇందూరు ప్రాంత రైతులు తరలివెళ్లారు. తెలంగాణ పసుపు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటపాటి నరసింహానాయుడు ఆధ్వర్యంలో ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల నుంచి 54 మంది పసుపు రైతులు వారణాసి వెళ్లారు. తమిళనాడులోని ఈరోడ్‌కు చెందిన పసుపు రైతుల సంఘం జాతీయ అధ్యక్షుడు దైవశిగామణి సహకారంతో వారణాసిలో నామినేషన్లు వేయడానికి పూనుకోగా అక్కడి పోలీసులు వారిని భయాందోళనలకు గురిచేశారు. కేవలం 25 మంది నామినేషన్లు మాత్రమే స్వీకరించారు. అక్కడ నామినేషన్‌కు డిపాజిట్ కోసం డబ్బులు కాకుండా తప్పనిసరిగా చలానాలు మాత్రమే తీసుకురావాలని సూచించగా అక్కడి బ్యాంకర్లు సహకరించకపోవడంతో సరైన సమయానికి 54 మంది రైతుల్లో 25 మంది నామినేషన్లు మాత్రమే తీసుకున్నారు. అందులోనూ 24 మంది నామినేషన్లు తిరస్కరించారు. కేవలం ఏర్గట్ల మండలానికి చెందిన ఇస్తారి అనే రైతు నామినేషన్ మాత్రమే అంగీకరించారు. దీంతో ఆ ఎన్నికల్లో పీఎం మోదీతో పోటీలో ఇస్తారికి 711 ఓట్లు వచ్చాయి. పీఎం మోదీకి ఎన్నికల సిబ్బంది వ్యవహరించారని పసుపు రైతులు ఫిర్యాదు చేశారు. మొత్తానికి పసుపు రైతుల డిమాండ్‌ను జాతీయ పార్టీల దృష్టికి తీసుకెళ్లడంలో పసుపు రైతులు సఫలమయ్యారు. నామినేషన్లు దాఖలు చేసినవారిలో పెంట చిన్న ముత్తన్న (కమ్మర్‌పల్లి), కుంట గంగామోహన్ రెడ్డి (ఆర్మూర్), గురడి రాజరెడ్డి (డిచ్‌పల్లి), కల్లెం లక్ష్మణ్ (కమ్మర్‌పల్లి), కొట్టాల చిన్నరెడ్డి (పడిగెల) తదితరులున్నారు.

కాంగ్రెస్‌ను దెబ్బతీసిన ఎర్రజొన్నల వివాదం..

ఇక 2008లో ఆర్మూర్ ప్రాంతంలో ఎర్రజొన్న విత్తనాల కొనుగోలు వ్యవహారంలో ఎగిసిపడిన ఆందోళన కారణంగా 2009 అసెంబ్లీ ఎన్నికల్లో బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమికి కారణమైంది.



ఆర్మూర్‌లో జాతీయ రహదారిపై పసుపు రైతుల సహపంక్తి భోజనాలు (ఫైల్)



2019లో వారణాసి వెళ్తున్న పసుపు రైతులు



2008లో ఆర్మూర్‌లో రైతులపై లాఠీచార్జి

క్లుప్తంగా

వైఎస్సార్‌టీపీ టికెట్ కోసం దరఖాస్తు



కామారెడ్డి టౌన్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ తరపున జుక్కల్ అసెంబ్లీ నుంచి పోటీ చేసేందుకు ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అయ్యాల సంతోష్ మంగళవారం దరఖాస్తు చేసుకున్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఆయన అనుచరులు శ్రీకాంత్ రెడ్డి, జీవన్ గౌడ్, మహ్మద్ పాషాలు దరఖాస్తును అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ.. జుక్కల్‌లో ఇప్పటి వరకు ప్రధాన పార్టీల అభ్యర్థుల వల్ల ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. తనకు వైఎస్సార్‌టీపీ, పోటీ చేసేందుకు అవకాశం ఇస్తుందని, ఇక ప్రజలు అవకాశం ఇవ్వాలని కోరారు. తన ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశానని అదే స్ఫూర్తితో జుక్కల్‌ను అభివృద్ధిని చేసి చూపిస్తానని ఆయన అన్నారు.

ఎలక్షన్ కోడ్‌కు తిలోదకాలు..



నిజామాబాద్‌రూరల్: జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. నిబంధనల ప్రకారం గోడలపై ఉన్న రాతలు తుడిచివేయడం, పలువురు నేతల విగ్రహాలకు బట్టలు కట్టాలి. కానీ ఆచరణలో మాత్రం సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారు. డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి నిర్లక్ష్యంగా తెల్లగుట్ట కట్టడంతో అది ఊడిపోయింది. బట్ట ఊడిపోయి మూడు రోజులు అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నిత్యం ఆ రోడ్డుగుండా ఎందరో అధికారులు ప్రయాణం చేస్తున్నా పట్టించుకోకపోవడంపై విస్మయానికి గురిచేస్తోంది.

రెడ్డిల క్షేత్రం..!

జంగ్ తెలంగాణ

- 61 ఏళ్ల పాటు ఆరుగురు 'రెడ్డి' ఎమ్మెల్యేల పాలన
- నియోజకవర్గంలో ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు
- ఎనిమిది సార్లు కాంగ్రెస్, మూడు సార్లు టీడీపీ, మూడు సార్లు బీఆర్ఎస్ ప్రాతినిధ్యం..
- ఒకసారి సోషలిస్టు పార్టీకి అవకాశం
- ప్రధాన పార్టీలను ఆదరించిన ఓటర్లు
- ఈ ఎన్నికల్లో గెలిచేదెవరో..?


అర్గుల్ రాజారాం


టంగుటూరి అంజయ్య


తుమ్మల రంగారెడ్డి


శనిగరం సంతోష్‌రెడ్డి


ఏలేటి మహిపాల్‌రెడ్డి


ఏలేటి అన్నపూర్ణమ్మ


బాజిరెడ్డి గోవర్ధన్


ఆశన్నగారి జీవన్‌రెడ్డి

ఆర్మూర్: రాష్ట్ర రాజకీయాల్లో ఆర్మూర్ నియోజకవర్గానికి ప్రత్యేక చరిత్ర ఉంది. ఆర్మూర్ కేంద్రంగా రాజకీయాలు నిర్వహించిన నాయకులు రాష్ట్ర స్థాయిలో ఉన్నత పదవులు అధిరోహించి చరిత్ర పుటల్లో ఎంతో మంది నాయకులు స్థానం సంపాదించారు. 1952కు ముందే ఆర్మూర్, వేల్పూర్, భీమ్‌గల్, జక్రాన్‌పల్లి, సిరికొండ మండలాల్లోని గ్రామాలను కలుపుతూ ఆర్మూర్ నియోజకవర్గం ఏర్పాటైంది. 2009 ఎన్నికలకు ముందు నియోజకవర్గ పునర్విభజన కారణంగా తన భౌగోళిక స్వరూపాన్ని మార్చుకుంది. నియోజకవర్గ పరిధిలో ఆర్మూర్ మున్సిపాలిటీ, ఆర్మూర్ మండలం, నందిపేట, మాక్లూర్, ఆలూర్, డొంకేశ్వర్ మండలాలు ఉన్నాయి. ఇప్పటి వర్గంలో నియోజకవర్గంలో 15 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరుగగా ఆరుగురు రెడ్డిల ఎమ్మెల్యేలు 61 ఏళ్ల పాటు పాలన కొనసాగించారు.

ముఖ్యమంత్రిగా ఒకరు, మంత్రులుగా ఇద్దరు..

నియోజకవర్గంలో మొదటగా 1952లో సోషలిస్టు పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన అర్గుల్ రాజారాం బీసీ నాయకుడిగా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, మాజీ మంత్రి శనిగరం సంతోష్‌రెడ్డి ఆయన శిష్యులుగా గుర్తింపు పొంది రాజకీయ వారసులుగా ఎదిగారు. కార్మిక నాయకునిగా ఎదిగిన టంగుటూరి అంజయ్య తన రాజకీయ జీవితంలో మొదటిసారిగా 1957లో ఆర్మూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. తర్వాతి కాలంలో 1980 అక్టోబర్ 16 నుంచి 1982 ఫిబ్రవరి 24వరకు రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 1962, 1967, 1972 ఎన్నికల్లో వరుసగా కాంగ్రెస్ పార్టీకి చెందిన తుమ్మల రంగారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1978, 1983 ఎన్నికల్లో అర్గుల్ రాజారాం శిష్యుడిగా రాజకీయ ప్రవేశం చేసిన శనిగరం సంతోష్‌రెడ్డి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. టీడీపీ స్థాపించి రాజకీయాల్లో ప్రభంజనం సృష్టించిన సమయంలో కూడా ఆర్మూర్ ప్రాంతంలో కాంగ్రెస్ అభ్యర్థిగా సంతోష్‌రెడ్డి విజయం సాధించి చరిత్ర సృష్టించారు. 1985 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన ఏలేటి మహిపాల్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొంది రెండు సంవత్సరాల పాటు అటవీ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 1989 ఎన్నికల్లో శనిగరం సంతోష్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విజయం సాధించారు. 1990 నుంచి 1991 వరకు కాంగ్రెస్ ప్రభుత్వంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా, 1991 నుంచి 1992 వరకు ఆర్థిక శాఖ మంత్రిగా, 1992 నుంచి 1993 వరకు భారీ పరిశ్రమల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఏలేటి మహిపాల్‌రెడ్డి మృతితో ఆయన సతీమణి ఏలేటి అన్నపూర్ణ 1994 ఎన్నికల్లో రాజకీయ ఆరంగేట్రం చేసి నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీలో నిలిచి గెలుపొందారు. 1999 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా శనిగరం సంతోష్‌రెడ్డి శిష్యుడు బాజిరెడ్డి గోవర్ధన్ పోటీ చేసి విజయం సాధించారు. 2004 ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసిన శనిగరం సంతోష్‌రెడ్డి నాలుగో సారి ఆర్మూర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పొత్తులో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో రవాణ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2009 శాసన సభ ఎన్నికల్లో టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణ ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

ప్రత్యేక తెలంగాణలో..

2014లో ప్రత్యేక తెలంగాణలో నిర్వహించిన మొట్టమొదటి ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి గెలుపొందారు. 2018లో రెండో సారి జీవన్‌రెడ్డి బీఆర్ఎస్ నుంచి గెలుపొందారు. 1952 నుంచి 2018 వరకు 15 నిర్వహించిన ఎన్నికల్లో ఒకసారి సోషలిస్టు పార్టీ, ఎనిమిది సార్లు కాంగ్రెస్, మూడు సార్లు టీడీపీ, మూడు సార్లు బీఆర్ఎస్ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు.

ఆర్మూర్ నుంచి ప్రాతినిధ్యం వహించిన వారు

1952-57	అర్గుల్ రాజారాం	సోషలిస్టు
1957-62	టంగుటూరి అంజయ్య	కాంగ్రెస్
1962-67	తుమ్మల రంగారెడ్డి	కాంగ్రెస్
1967-72	తుమ్మల రంగారెడ్డి	కాంగ్రెస్
1972-79	తుమ్మల రంగారెడ్డి	కాంగ్రెస్
1979-83	శనిగరం సంతోష్‌రెడ్డి	కాంగ్రెస్
1983-85	శనిగరం సంతోష్‌రెడ్డి	కాంగ్రెస్
1985-89	ఏలేటి మహిపాల్‌రెడ్డి	టీడీపీ
1989-94	శనిగరం సంతోష్‌రెడ్డి	కాంగ్రెస్
1994-99	ఏలేటి అన్నపూర్ణ	టీడీపీ
1999-2004	బాజిరెడ్డి గోవర్ధన్	కాంగ్రెస్
2004-2009	శనిగరం సంతోష్‌రెడ్డి	బీఆర్ఎస్
2009-2014	ఏలేటి అన్నపూర్ణ	టీడీపీ
2014-2018	ఆశన్నగారి జీవన్‌రెడ్డి	బీఆర్ఎస్
2018-2023	ఆశన్నగారి జీవన్‌రెడ్డి	బీఆర్ఎస్

ప్రస్తుతం నియోజకవర్గ ఓటర్లు

పురుషులు	96,404
మహిళలు	1,09,933
ఇతరులు	07
మొత్తం	2,06,344

మంజులమ్మకు నాయకుల ఘన నివాళి


ద్వాదశ దినకర్మకు హాజరైన స్పీకర్ పోచారం దంపతులు

వేల్పూర్: రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తల్లి మంజులమ్మ ద్వాదశ దినకర్మ మంగళవారం వేల్పూర్‌లో నిర్వహించగా పలువురు నాయకులు హాజరై పుష్పాంజలి ఘటించారు. అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యేలు బిగాల గణేశ్ గుప్తా, జీవన్‌రెడ్డి, రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్‌చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్టమధు, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు పుష్పాంజలి ఘటించారు. వీరితో పాటు నియోజకవర్గ ప్రజలు వేలాదిగా తరలివచ్చి నివాళి అర్పించారు.

మంత్రికి పరామర్శ


నివాళి అర్పిస్తున్న మంత్రి హరీశ్‌రావు

వేల్పూర్: మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తల్లి మంజులమ్మ ఇటీవల మృతి చెందడంతో రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు సోమవారం పరామర్శించారు. మంజులమ్మ చిత్రపటానికి నివాళి అర్పించారు. మంత్రి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

'కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం'


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గంప

కామారెడ్డి టౌన్: కామారెడ్డిలో పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో దోమకొండకు చెందిన పలువురు ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. సుమారు 200 మంది కాంగ్రెస్, బీజేపీలకు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. దోమకొండ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, భిక్కనూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుంచాల శేఖర్, మాజీ జెడ్పీటీసీ మధుసూదనరావు పాల్గొన్నారు.

స్కాట్లాండ్‌లో ఘనంగా బతుకమ్మ సంబురాలు



నిజామాబాద్‌అర్బన్: స్కాట్లాండ్ దేశంలోని అబర్డీన్ సిటీలో సోమవారం హిందూ దేవాలయాల ట్రస్ట్ అధ్వర్యంలో తెలుగు కమ్యూనిటీ ప్రజలు బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి గౌరమ్మలను చేసి భక్తి శ్రద్ధలతో పూజించారు. బతుకమ్మలను స్థానిక డాన్ రివర్‌లో నిమజ్జనం చేసి ప్రసాదాలు పంచుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నిర్వాహకులు వివేక్ పడకంటి, ప్రవాస భారతీయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోధన్‌లో పోలీసుల కవాతు


బోధన్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

బోధన్‌టౌన్: బోధన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీసు బలగాలు మంగళవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల్లో విశ్వాసం కల్పించడానికే కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కవాతులో ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐలు ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి: ప్రజల్లో భద్రతా భావం పెంపొందించడానికి కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఎల్లారెడ్డి మండలంలోని పలు ప్రాంతాల్లో కేంద్ర ఎస్ఎస్‌బీ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎస్ఎస్‌బీ బలగాలు నియోజకవర్గంలో సాధారణ ఎన్నికలు పూర్తయ్యేంత వరకు ఉంటాయని అన్నారు. ఎస్ఎస్‌బీ బలగాలతో జిల్లాలోని పోచారం, దగ్గి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులు, వాహనాల తనిఖీల్లో వీరిని వినియోగించనున్నట్లు తెలిపారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై గణేశ్, సిబ్బంది ఉన్నారు.


ఎల్లారెడ్డిలో కేంద్ర బలగాలు..

ముమ్మరంగా వాహనాల తనిఖీ


ముప్కాల్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న సిబ్బంది

బాల్కొండ/ ఖలీల్‌వాడి/ భిక్కనూరు: ముప్కాల్ మండల శివారులో సోమ, మంగళవారాల్లో సీఆర్‌పీఎస్ సిబ్బంది, పోలీసులు వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేపట్టారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున డబ్బు అక్రమంగా తరలకుండా ఉండేందుకు వాహనాల తనిఖీ చేపడుతున్నట్లు ముప్కాల్ ఎస్సై భాస్కరాచారి తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు వాహనాదారులు సహకరించాలని కోరారు. జిల్లా కేంద్రంలోని ఒకటి, రెండో టౌన్ పీఎస్ పరిధిలో పోలీసులు, కేంద్ర బలగాలు వాహనాల తనిఖీని ముమ్మరం చేశారు. పెద్దబజార్, రైల్వేస్టేషన్ పరిధిలో వాహనాలను తనిఖీ చేపట్టారు. భిక్కనూరు మండల సమీపంలోని పోలీస్ చెక్‌పోస్టు వద్ద సీఐ తిరుపయ్య, ఎస్సై సాయికుమార్, స్పెషల్ పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు.


నగరంలోని పెద్దబజార్‌లో..


భిక్కనూరులో..

డీజే వద్దన్నందుకు దాడి



భిక్కనూరు: డీజే సౌండ్‌తో ఇబ్బంది కలుగుతోందన్న ఒకరిపై నలుగురు దాడి చేసిన ఘటన మండలంలోని పెద్దమల్లారెడ్డిలో మంగళవారం చోటుచేసుకుంది. దసరా సందర్భంగా గ్రామంలోని దళితవాడలో సూరారం గణేశ్, సూరారం దినేశ్, బండారి శివ, సూరారం బాలయ్య సోమవారం రాత్రి నుంచి మంగళవారం వేకువ జాము వరకు డీజే పెట్టి నృత్యాలు చేశారు. దీంతో చుట్టు పక్కల వారు అభ్యంతరం తెలిపారు. కోపోద్రోక్తులైన వారు గ్రామానికి చెందిన చల్మెడ బాబుపై కర్రతో దాడి చేశారు. ఈ ఘటనలో ఓ మహిళకు సైతం గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి డీజే బాక్స్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాయికుమార్ పేర్కొన్నారు.

బాలికపై అత్యాచారయత్నం

ఆర్మూర్‌టౌన్: ఆలూర్ మండల కేంద్రంలో ఓ మైనర్ బాలికపై ఒకరు అత్యాచారయత్నానికి పాల్పడ్డ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన 9 ఏళ్ల బాలిక తన ఇంటి ఎదుట మెహెందీ పెట్టుకుంటున్న సమయంలో అదే ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఆదివారం రాత్రి మాయమాటలు చెప్పి ఇంటి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలోకి తీసుకెళ్లి అత్యాచారయత్నం చేశాడు. ఆ బాలిక వెంట ఉన్న మరో బాలిక ఈ ఘటనను చూసి కేకలు వేస్తూ బాధిత తల్లికి చెప్పడంతో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించగా బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్

కల్లు స్థావరంపై దాడి

ఎడపల్లి: గ్రామంలో అనుమతి లేకుండా కల్లు విక్రయిస్తున్న స్థావరంపై ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ బృందం మంగళవారం దాడి చేసింది. గ్రామానికి చెందిన శేఖర్ ఇటీవల అక్రమంగా కల్లు తయారు చేసి ప్యాకెట్లలో ప్యాక్ చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు దాడి చేసి నిందితుడిని పట్టుకున్నారు. దీంతో సదరు నిందితుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా అధికారులు, కుటుంబీకులు అడ్డుకున్నారు. అక్రమంగా కల్లు విక్రయిస్తున్నందుకు శేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

టమాట లారీ బోల్తా

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ శివారులోని జాతీయ రహదారిపై టమాట లారీ మంగళవారం బోల్తా పడింది. వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపూర్ నుంచి ఢిల్లీకి టమాటల లోడుతో వెళ్తున్న లారీ బస్వాపూర్ శివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు రాగానే జాతీయ రహదారిపై అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో లారీలో ఉన్న టమాట బాక్సులు కిందపడ్డాయి. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నిజామాబాద్‌రూరల్: రూరల్ పీఎస్ పరిధిలోని శ్రీనగర్ నుంచి కాలూర్‌కు వెళ్లే రహదారి పక్కన గుర్తు తెలియని మృతదేహం లభించినట్లు రూరల్ ఎస్సై మహేశ్ తెలిపారు. రహదారి పక్కన్న ఉన్న బైల్డ్‌రైస్‌కు వాడే ఈటీపీ కుండీలో మృతదేహం ఉందన్న శ్రీనగర్ సర్పంచ్ సురేందర్‌రెడ్డి సమాచారం మేరకు ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ వెంకటరమణ ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించచి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎనిమిది మందిపై కేసు నమోదు


చెట్లు నరికిన ప్రాంతం

లింగంపేట: మండలంలోని రాంపల్లి కొనతండాకు చెందిన ఎనిమిది మంది గిరిజనులపై కేసు నమోదు చేసినట్లు నాగిరెడ్డిపేట ఎఫ్ఆర్‌వో వాసు మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాంపల్లి తండాకు చెందిన గిరిజనులు నాలుగు రోజులుగా తండా శివారులోని 688, 689 కంపార్టుమెంటులో అక్రమంగా అటవీ భూమిలో చెట్లను నరికినట్లు ఆయన పేర్కొన్నారు. సదరు గిరిజనులకు అడవులు నరకవద్దని పలుమార్లు సూచించి అవగాహన కల్పించినా వారిలో మార్పురాలేదన్నారు. నాలుగు రోజులుగా చెట్లను నరికివేస్తూ అటవీ భూమిని కబ్జా చేస్తున్నట్లు తెలిపారు. అడవిని ధ్వంసం చేసినందుకు ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్‌వో తెలిపారు. మరి కొంత మంది వివరాలను సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. సెక్షన్ అధికారి సలీమ్, బీట్ అధికారి భూపతి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి


అక్షయ్(ఫైల్)

బాల్కొండ: మండల కేంద్రంలో దసరా రోజు విషాద చాయలు అలుముకున్నాయి. బాల్కొండకు చెందిన వేముల అక్షయ్(21) నిర్మల్‌కు స్నేహితులతో కలిసి సోమవారం వెళ్లాడు. గంజాల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్షయ్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పండుగ రోజు సరాదాగా స్నేహితులతో కలిసి వెళ్లిన అక్షయ్ మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

బైకును ఢీకొన్న బస్సు.. ఒకరి మృతి

లింగంపేట: లింగంపేట మండలం మెంగారం శివారులోని మూల మలుపు వద్ద బైకును బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డి వైపు వెళ్తున్న బస్సు ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న బైకును ఢీకొనగా బైక్‌పై వెళ్తున్న బత్తుల రవి(32) అక్కడి కక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒంగోలు జిల్లా పొదిలి గ్రామానికి చెందిన వాడిగా గుర్తించారు. రవి కొంత కాలంగా ఉపాధి నిమిత్తం గాంధారిలో మేస్త్రీ పని చేస్తూ జీవిస్తున్నాడు. గాంధారిలో అద్దెకు ఉంటున్న ఇంటి యజమానికి ఎల్లారెడ్డికి వెళ్లి అద్దె డబ్బులు ఇచ్చి తిరిగి వస్తున్న క్రమంలో ప్రమాదం చోటు చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

భార్యను చంపిన భర్త


సత్తిరోజా మృతదేహం

నందిపేట్: కట్టుకున్న భార్యను భర్త గొంతు నులిపి చంపేసిన ఘటన మండలంలోని కుద్వాన్‌పూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై రాహుల్ తెలిపిన వివరాల ప్రకారం.. కుద్వాన్‌పూర్‌కు చెందిన సత్తి సాగర్‌కు బాల్కొండకు చెందిన సత్తిరోజా(32)తో 13 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి సుశాంత్, అశ్విన్‌కుమారులు ఉన్నారు. పెళ్లయిన నాటి నుంచి రోజాతో భర్త, అత్తలు మానసికంగా, శారీరకంగా హింసించేవారు. అదనపు కట్నం తీసుకురావాలంటూ ఇబ్బందులకు గురిచేసేవారు. సోమవారం రోజా నిద్రిస్తున్న సమయంలో భర్త సాగర్, అత్త పెద్దమ్మి రోజాను గొంతునులిమి హత్య చేశారు. దీనిని ఆత్మహత్యగా చిత్రికరించేందుకు రోజా నోట్లో పురుగుల మందు పోసి చుట్టుపక్కల వారిని నమ్మించే ప్రయత్నం చేశారు. కాగా స్థానికులకు అనుమానం వచ్చి ప్రశ్నించగా భార్య ను హత్యచేసిన విషయాన్ని సాగర్ ఒప్పుకున్నాడు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు తల్లి, కొడుకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్ పేర్కొన్నారు.

చికిత్సపొందుతూ యువకుడు..


సాయిలు(ఫైల్)

నాగిరెడ్డిపేట: భార్య కాపురానికి రావడంలేదని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడు నిజామాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందాడు. నాగిరెడ్డిపేటకు చెందిన జగ్గని సాయిలు(35)కు భార్య రాధికకు గొడవ జరిగి పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య కాపురానికి రావడంలేదనే బాధతో ఈ నెల 15న గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని సాయిలు కుటుంబసభ్యులకు చెప్పకపోవడంతో ఆరోగ్య పరిస్థితిపై అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం సాయిలును ఈ నెల 21న కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ సాయి లు మృతి చెందాడు. మృతుడి తల్లి సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

చెరువులో పడి ఒకరు..


నరసింహరాజు (ఫైల్)

జక్రాన్‌పల్లి: మండల కేంద్రానికి చెందిన అల్లెపు నరసింహరాజు (32) చెరువులో పడి అనుమానస్పదంగా మృతి చెందాడు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. జక్రాన్‌పల్లికి చెందిన నరసింహరాజు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ నెల 22న కూలీ పనులు చేసుకుని ఇంటికి వచ్చిన రాజు తిరిగి బయటకు వెళ్లాడు. కానీ రాత్రి ఇంటికి చేరుకోలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. ఈ నెల 23న భార్య అల్లెపు లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. గ్రామ సమీపంలోని పెద్ద చెరువులో మృతదేహం ఉందన్న సమాచారం మేరకు వెళ్లి పరిశీలించగా నరసింహరాజు మృతదేహంగా గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

లిఫ్ట్ పడిపోయి ఇద్దరికి గాయాలు

ఖలీల్‌వాడి: నగరంలోని గంగస్థాన్ ఫేజ్–2లో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో నాలుగో అంతస్తు నుంచి లిఫ్ట్ సెల్లర్‌లోకి కిందకి పడిపోవడంతో అందులో ఉన్న ఇద్దరికి మంగళవారం గాయాలయ్యాయి. దీంతో అపార్ట్‌మెంట్ వాసులు భయాందోళనకు గురయ్యారు. గాయాలైన వారిని అపార్ట్‌మెంట్ వాసులు ఆసుపత్రికి తరలించారు. అపార్ట్‌మెంట్‌లో లిఫ్ట్ పడిపోవడం ఇది మూడోసారి అని స్థానికులు పేర్కొన్నారు.

ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో పండుగ పూట విషాదం చోటుచేసుకుంది. సోమవారం రాత్రి మండలంలోని ఉప్లూర్‌కు చెందిన దాకూరి చక్రవర్తి, తన కొడుకు సుమిత్‌తో కలిసి మెట్‌పల్లి రోడ్‌లోని తన టింబర్ డిపోకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మసీద్ వద్ద రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై వస్తున్న కమ్మర్‌పల్లికి చెందిన కరిపె మారుతి వీరిని ఢీకొన్నాడు. ఈ ఘటనలో చక్రవర్తి, సుమిత్‌కు తీవ్రగాయాలు కాగా, మారుతికి స్వల్ప గాయాలయ్యాయి. గ్రామస్తులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. వీరి పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్‌కు తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మారుతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ పేర్కొన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

బీబీపేట: మండల కేంద్రానికి ఒకరు జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రాంరెడ్డిపల్లి కాలనీకి చెందిన రావర్తి బాబు (32) వృత్తిరీత్యా ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బాబు తల్లిదండ్రులు, భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో కుటుంబ సభ్యులు లేరన్న బాధ, జీవితంపై విరక్తితో బాబు గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి మామ పరశరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్నట్లు ఎస్సై పేర్కొన్నారు.